క్లుప్తంగా

సచార కమిటీ సిఫార్సులను అమలు చేయాలి

మంగళగిరి: సచార కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని ఏఎంసీజీఏస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలో ఈద్గా మైదానం ఆవరణలో ఆదివారం ఏఎంసీజీఏస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు మాట్లాడుతూ చట్టసభలలో జనాభా ప్రాతిపాదికన సీట్లు కేటాయింపు, విద్య, ఉపాధి రంగాలలో జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలన్నారు. వడ్డీ రహిత ఇస్లామిక్ బ్యాంక్‌ను నెలకొల్పి ఉపాధి కల్పించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సాధికారికత రంగాలను నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు యూసఫ్, అబ్దుల్ రజాక్, సాధిక్, షరీఫ్, బషీర్, బాబావలి పాల్గొన్నారు.

రైతుల రుణాలు రద్దు చేయాలి

తాడేపల్లిరూరల్: పంట నష్టపోయిన రైతుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఉండవల్లిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో రాజధాని రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జొన్నా శివశంకరరావు విచ్చేసి మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రెండు లక్షలలోపు ఉంటే వాటిని తక్షణం రద్దు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. సమావేశంలో రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, షేక్ ఎర్రపేరు, పి.వీరాస్వామి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ గణేష్ పోటీలు



మంగళగిరి: నగరంలోని మెయిన్ బజారులో ఉన్న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఎకో ఫ్రెండ్లీ గణేష్ మేకింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ కాంపిటీషన్స్‌లో సుమారు 400 మందికి పైగా చిన్నారులు పాల్గొని మట్టి గణేష్ ప్రతిమలను తయారు చేశారు. పోటీల్లో మొదటి బహుమతి ఎస్ఎల్ఎం చైతన్య స్కూల్ విద్యార్థిని రష్మి, రెండవ బహుమతి అరవింద స్కూల్ విద్యార్థి ఎస్ నాగ రేవంత్, మూడవ బహుమతి ఎస్ఎస్ టాలెంట్ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ వర్షిత సాధించారు. విజేతలకు వివిధ రాజకీయపార్టీల నాయకుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన రిలేదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. వారు మాట్లాడుతూ మాదిగల ఉన్నతి కోసం శ్రమించిన నాయకుడు మందకృష్ణ అన్నారు. వర్గీకరణ చేయకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చందోలు విక్టర్‌పాల్, ఇందుపల్లి రామారావు, కలకోటి నాగేశ్వరరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, పులివర్తి నథానియేలు, యేసుపోగు శ్యామల, పాతకోటి భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో పాము



మంగళగిరి: తన నివాసంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనంలో పాము కనిపించడంతో ఓ యువకుడు భయాందోళనకు గురయ్యాడు. ఎంత సేపు శ్రమించినా ద్విచక్రవాహనం నుంచి పాము బయటకు రాలేదు. సేకరించిన వివరాల మేరకు.. యర్రబాలెంకు చెందిన కోసూరి వీరయ్య కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో పార్కింగ్ చేసిన తన స్కూటీ వాహనాన్ని బయటకు తీశాడు. ద్విచక్ర వాహనంలో పాము ఉండటాన్ని గమనించాడు. వెంటనే తన ఇంటి సమీపంలో ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపైకి తీసుకువచ్చి స్థానికుల సహాయంతో పామును బయటకు తీసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. పాము మాత్రం బయటకు రాలేదు. చేసేది లేక ద్విచక్ర వాహనాన్ని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసి మిన్నకుండిపోయారు.

నగరంలో చవితి సందడి

- ప్రారంభమైన పత్రి పూల విక్రయాలు
- ప్రజలతో కళకళలాడుతున్న మార్కెట్
- మట్టి ప్రతిమలు పంపిణీకి ఏర్పాట్లు
- పలు సెంటర్లలో వినాయక విగ్రహాల ఏర్పాటు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు



పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో కిటకిటలాడుతున్న ప్రధాన సెంటర్

మంగళగిరి: నగరంలో ఆదివారమే వినాయక చవితి సందడి నెలకొంది. సోమవారం వినాయక చవితి కావడంతో పత్రి, పూలు, పండ్లు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు వీధుల్లోకి రావడంతో కళకళలాడుతుంది. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పలు కూడళ్లలో మండపాలను నిర్మించారు. వాటిని అందంగా అలంకరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మట్టి ప్రతిమల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నాయి. మట్టి ప్రతిమలనే పూజలకు వినియోగించి పర్యావరణాన్ని రక్షించాలని రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరితోపాటు ఆయా ధార్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను కోరాయి. బాలగణపతి ఉత్సవ సేవా సంఘంతోపాటు పలు కూడళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పందిళ్ల వద్ద ఎటువంటి ఘర్షణలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని నార్త్‌జోన్ డీఎస్పీ జె రాంబాబు పట్టణ, రూరల్ సీఐలు మల్లికార్జునరావు, భూషణం కోరారు. పందిళ్ల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు పోలీస్ శాఖ నిబంధనలను పాటించాలన్నారు. మండపాల వద్ద కమిటీ సభ్యులు నిరంతరం రాత్రి వేళల్లో తప్పనిసరిగా ఉండాలని, డీజేలు ఏర్పాటు చేసి ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర కూడళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా కమిటీలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంతరాలు కలుగకుండా, ఘర్షణ లేకుండా కమిటీ సభ్యులతో పాటు పోలీస్‌శాఖ నిఘా ఉంటుందన్నారు. భక్తులంతా ప్రశాంతమైన వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు.



వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు



పత్రి కొనుగోలు చేస్తున్న మహిళ



విద్యుత్ దీపాల అలంకరణలో మంటపం

తాడేపల్లిరూరల్‌లో

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాలతోపాటు దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో వినాయకచవితి పండుగ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు యువకులు భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా పందిళ్లు ఏర్పాటు చేసి వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పోలకంపాడు వద్ద వినాయక విగ్రహాలు తయారు చేసే కేంద్రాల వద్ద అమ్మకాలు జోరందుకున్నాయి. విగ్రహాలు కొనుగోలు చేసేందుకు పలు ప్రాంతాలను నుంచి భక్తులు రావడంతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. వినాయకచవితి సందర్భంగా ఉండవల్లి సెంటర్, ఓల్డ్ టోల్‌గేట్, ప్రాతూరు అండర్‌పాస్, ప్రకాశం బ్యారేజ్, మహానాడు ప్రాంతాల్లో పూజాకు ఉపయోగించే పత్రి అమ్మకాలు జోరందుకున్నాయి. వినాయకచవితి సందర్భంగా పూలరేట్లు ఆకాశాన్ని అంటాయి. డజను అరటిపండ్లు రూ.80 నుంచి రూ.90 వరకు అమ్ముతున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు 5 అడుగుల నుండి 22 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసి పందిళ్లు నిర్మించారు.



ఉండవల్లి సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పత్రి, పూజా సామాగ్రి

33 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కాండ్రు కమల



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కమల

మంగళగిరి: రానున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లులో ఓబీసీ కోటా కింద 33 శాతం రిజర్వేషన్ కేటాయించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కాండ్రు కమల అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 25 సంవత్సరాల కిందట ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఇప్పటికీ ఆమోదానికి నోచుకోకపోవడం శోచనీయమన్నారు. భారత జనాభాలో 48 శాతం మహిళలు ఉన్నారని, చట్టసభల్లో వీరి ప్రాతినిధ్యం ఏనాడూ 15 శాతానికి మించలేదన్నారు. మహిళలు తమ మనోభావాలను, సమస్యలను తెలియజేయడానికి వేదిక చట్టసభలేనని, మహిళల పాత్ర తప్పనిసరి అన్నారు. మహిళా బిల్లు చట్టపరంగా ఆమోదం పొందితే ఎవరి సీటు ఎవరికి వస్తుందోననే భయం అన్ని రాజకీయ పార్టీలకు పట్టుకుందని, అందుకే బిల్లు రూపకల్పన చేసినా బిల్లులో లోపాలకు అవకాశం కల్పించి చట్టంగా మారకుండా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పారేపల్లి మహేష్, కాగితాల స్వాతి గౌడ్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, మాదు నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు. వినాయ చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

తాడేపల్లిరూరల్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకరరావులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. చందు జనార్దన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే మట్టి వినాయకుడినే ఆరాధించాలని కోరారు. యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మీరావలి మాట్లాడుతూ పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించడం వల్ల పర్యావరణానికి ఎటువంటి హానీ కలుగదని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు గాదె కన్నారావు, సీపీఎం నాయకులు వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ నారాయణ, సీపీఎం సీనియర్ నాయకులు తోట సాంబశివరావు, సాంబశివరావు, పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించినందుకే బాబు జైలుపాలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్

తాడికొండ: ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించి రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను విస్మరించినందుకే బాబు జైలు పాలయ్యాడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. బాబు అరెస్టుతో రోడ్లపైకి ఎక్కి టీడీపీ ముసుగులో ఓ సామాజిక వర్గం అరాచకాలు చేస్తుందని విమర్శించారు. ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబు రెండెరకాల భూమితో రాజకీయాల్లోకి వచ్చి లక్షల కోట్లు ఆర్జించిన నిందితుడు కోసం నిరసనల పేరుతో రోడ్లపైకి రావడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజులన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పు చేసిన వారికి తగిన శిక్షలు వేయడం పరిపాటి అని, ప్రధానులుగా చేసిన వ్యక్తులు సైతం అవినీతి ఆరోపణల్లో జైలుకు వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నప్పటికీ బాబు అరెస్టును రాజకీయాలకు ఆపాదిస్తూ రోడ్లెక్కడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కుల, మత రాజకీయాలను రెచ్చగొట్టి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని చూసిన చంద్రబాబుకు తగిన శాస్తి జరిగిందని రాష్ట్ర ప్రజలు సంతోషంలో ఉంటే ఓ సామాజిక వర్గం మాత్రం రోడ్లెక్కి గందరగోళం సృష్టించాలని చూడటం సిగ్గుచేటన్నారు. అవినీతి అనకొండ చంద్రబాబుపై ఉన్న కేసులన్నింటిలో స్టేలు తొలగించి విచారణ చేసి జైల్లోనే ఉంచాలని, ఆయన బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేసి విచారణను మభ్యపెట్టే అవకాశం ఉందని అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ సుస్థిర పాలన కొనసాగుతుందని, మరో 50 సంవత్సరాలు జగనన్న సీఎంగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఫిరంగిపురం: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఫిరంగిపురం, మేడికొండూరు, తుళ్లూరు, తాడికొండ మండలాల్లోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రసూన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుండాలపాడు (ఓసీ), ఫిరంగిపురం(3వవార్డు), నుదురుపాడు (పోలేరమ్మ గుడి వద్ద), మేడికొండూరు మండలం కొర్రపాడు (ఎస్టీ)కాలనీ, తుళ్లూరు మండలం మందడం(ఓసీ), తాడికొండ మండలం ముక్కామల (బీసీ డి) కేంద్రాల్లో ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5గంటలలోగా ఫిరంగిపురం ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

కేఎల్‌యూలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ



ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణకు మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షనల్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో సోమవారం వినాయకచవితి పండుగ సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాల ప్రాముఖ్యత గురించి వివరించామని, భారతదేశం అంతటా జరుపుకునే పండుగ వినాయకచవితి అని అన్నారు. సాధారణంగా వినాయక విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేస్తారని, వీటిని నీటిలో నిమజ్జనం చేయడం వలన నీటి వనరులకు హాని కలుగుతుందని అన్నారు. సుమారు 1500 మట్టి వినాయక విగ్రహాలు తయారు చేయించి పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణకు మట్టి వినాయకుని ప్రతిమను అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు చవితి శుభాకాంక్షలు




తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలు తొలగించే వినాయకుడు పండుగను ప్రతి ఇంటా సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని, నియోజకవర్గ ప్రజలకు సకల శుభాలు జరగాలని ఆకాంక్షించారు.

ఫోన్ చోరీ...ఆపై రూ. 80వేల నగదు విత్‌డ్రా

సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

మంగళగిరి: సెల్‌ఫోన్ చోరీ చేసి ఆపై అదే ఫోన్ నుంచి రూ.80వేల నగదును ఓ దుండగుడు విత్‌డ్రా చేసిన ఘటన చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెంకు చెందిన నాయుడు వెంకట్రావు తన కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 14వ తేదీన తిరుపతి వెళ్లాడు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో వెంకట్రావు, ఆయన మేనల్లుడు పాశం వెంకటేశ్వరరావుల జేబుల్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. స్వామి వారి దర్శనానికి బస్సులో బయలుదేరే సమయంలో ఇరువురు తమ ఫోన్లు మాయమైనట్లు గుర్తించారు. వెంకట్రావు వెంటనే యర్రబాలెంలోని తన సమీప బంధువుకు ఫోన్ చేసి యూనియన్ బ్యాంకుకు వెళ్లి ఖాతాలోని బ్యాలెన్స్ తనిఖీ చేయాలని కోరాడు. తన ఖాతాలో రూ.1,79,365 ఉండాల్సి ఉండగా రూ.99,365 మాత్రమే ఉండటంతో రూ.80వేలు మాయం చేశారని గుర్తించి తన ఖాతాను బ్లాక్ చేయించాలని కోరాడు. ఘటనపై వెంటనే తిరుపతి ఈస్ట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అక్కడ అధికారులు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితుడు సైబర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా వారు ఖాతాకు సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్ కాపీ కావాలని కోరారు. చేసేది లేక స్వామివారి దర్శనానంతరం తిరిగి యర్రబాలెం చేరుకున్న బాధితుడు వెంకట్రావు ఆన్‌లైన్‌లో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆదివారం మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ మల్లికార్జునరావుకు వివరాలు తెలుపగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తే తాము దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఏబీఎన్ వ్యాఖ్యలు నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం



ఏబీఎన్ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ నాయకులు

తాడికొండ: రజకులపై ఏబీఎన్ యాంకర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తాడికొండ బస్టాండ్ కూడలిలో ఆదివారం ఏబీఎన్ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల బీసీ సెల్ అధ్యక్షులు మోరం నాగసాయి, ఉల్లంఘుల శివనాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చంద్రబాబుకు మద్దతుగా బెంగుళూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో రజకులను కించపరిచే విధంగా ఏబీఎన్‌యాంకర్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని, యాంకర్‌తోపాటు ఏబీఎన్ రాధాకృష్ణపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాధాకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకుంటే పరిణామాలు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు దమ్మాటి మోహనరావు, రాచకొండ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక మహోత్సవం



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాన్స్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక మహోత్సవం- 2 ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి సక్కు మాధవి అధ్యక్షత వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి డాన్స్ స్కూల్స్ చిన్నారులు పాల్గొన్నారు. లారెన్స్ గ్రూప్ డాన్స్ (దివ్యాంగులు), వెరైటీ డాన్స్, క్లాసికల్ డాన్స్, వెస్టర్న్ డాన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. శివ మిమిక్రీ ఉత్సాహపరిచింది. శరణ్య, విజయసాయి ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం డాన్స్ మాస్టర్ చంటి, డాన్సర్లకు మెమెంటోలను అందించి, సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

21న కేఎల్‌యూలో మెగా వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఈనెల 21వ తేదీన ఉచిత అధునాతన మెగా వైద్య సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంజె నాయుడు హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంతశర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, క్యాంపస్‌కు వచ్చిన తల్లిదండ్రులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిసర ప్రాంత ప్రజల ప్రయోజనార్థం ఈనెల 21 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై పరీక్షలు చేస్తారని తెలిపారు. డాక్టర్ ఎం.జె. నాయుడు, డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణలు, ఫిజియోథెరపిస్టుల బృందం తమ సేవలను అందించనున్నారని తెలిపారు. బీపీ, షుగర్‌తోపాటు ఎముకల అరుగుదల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి




తోకల అంజమ్మ (ఫైల్)

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందింది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... యర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన తోకల అంజమ్మ (50) పూలు విక్రయించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమె భర్త రోశయ్య పంచాయతీ పారిశుధ్య కార్మికునిగా పనిచేసే సమయంలో కంటి జబ్బుకు గురై చూపు కోల్పోయి ఇంటి వద్దనే ఉంటున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో అంజమ్మ ఈనెల ఐదో తేదీన యర్రబాలెం స్పెన్సర్ సెంటర్‌లో పూలు విక్రయించుకుని ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అంజమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను హుటాహుటీన ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. 12 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కుటుంబ సభ్యులకు సూచించారు. మూడు రోజుల కిందట అంజమ్మను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

ఒకరి మృతి–ఇద్దరికి స్వల్పగాయాలు



మృతిచెందిన విష్ణువర్ధన్

ఫిరంగిపురం: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని బేతపూడి గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొనుగుపాడు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ కుటుంబపనుల నిమిత్తం ఖాజావలి కారులో బేతపూడి గ్రామానికి వెళ్లారు. అక్కడి నుంచి నరసరావుపేట రోడ్డుకు వస్తుండగా మార్గం మధ్యలో బేతపూడి మలుపు వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. విష్ణువర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులోని ఖాజావలి, డి.శ్రావణికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జీజీహెచ్‌కి తరలించారు. మృతదేహాన్ని నరసరావుపేటకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు.